మత్స్యగెడ్డ.. మృత్యుఘోష

- నాటు పడవలపై ప్రమాదకర ప్రయాణాలు
- ప్రాణాలు కోల్పోతున్న గిరిజనులు
- చేపల వేటలోను ప్రమాదాలు..
- ఫైబర్ బోట్లు, వలలు అందించాలని కోరుతున్న గిరిజనులు



చేపల వేట కోసం బోటు తయారుచేస్తున్న గిరిజనమత్స్య కారులు



పడవపై తాడు సహాయంతో మత్స్యగెడ్డ దాటుతున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: నిత్యం మత్స్యగెడ్డ దాటలేనిదే వారికి జీవనం సాగదు.. నిత్యావసర సరకులు, వ్యాపార లావాదేవీలు, చదువులు అన్నింటికి మత్స్యగెడ్డపై నాటు పడవలపై ప్రయాణాలు చేయాల్సిందే...ప్రయాణంలో నాటు పడవలు మునిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలంలో పనసపుట్టు, సుజనకోట, పెదగూడ, దారెల, వనుగుమ్మ, జోలాపుట్టు, మాకవరం, రంగబయలు పంచాయతీల్లో సుమారు 86గ్రామాల మీదుగా మత్స్యగెడ్డ విస్తరించి ఉంది. ఆయా గ్రామస్తులు రోజూ నాటు పడవలపై ప్రయాణించి మండల, పంచాయతీ కేంద్రాలకు పనుల నిమిత్తం వస్తుంటారు. దీంతో పాటు గిరిజన మత్స్యకారులు నాటు పడవలపైనే చేపల వేటను సాగిస్తుంటారు. వేటాడిన చేపలను మండల కేంద్రం, వారపు సంతలకు తీసుకువచ్చి అమ్మకాలు చేసి జీవనం సాగిస్తుంటారు.

యంత్రాంగం హామీలు..నీటిపై రాతలు

మత్స్యగెడ్డలో ప్రయాణాలు, చేపల వేటలో సమయాల్లో నాటు పడవలు బోల్తా కొట్టి అనేకమంది ప్రాణాలను కోల్పోయారు. ప్రమాదాలు జరిగే సమయాల్లో మాత్రం నేతలు, అధికారులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు భరోసా కల్పించే హామీలు గుప్పించి, తరువాత విస్మరించడం పారిపాటిగా మారింది. దీంతో నేతల హామీలు నీటిపై రాతలుగానే మిగులుతున్నాయి. మండలంలో ఆరు పంచాయతీల్లో మత్స్యగెడ్డ పరివాహిక గ్రామాల్లో ప్రభుత్వం లెక్కల ప్రకారం నాటుపడవల ప్రమాదాల్లో 86 మంది మృతి చెందారు. ముఖ్యంగా సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామం వద్ద ప్రతి రోజు గిరిజనులు తాడు సహాయంతో బోటుపై గిరిజనులు ప్రమాదభరితంగా దాటుతున్నారు. కుమ్మరిపుట్టు వద్ద వంతెన నిర్మించాలని గత కొన్నేళ్లుగా గిరిజనులు పోరాటాలు చేస్తున్నా యంత్రాంగం, అధికారులు పట్టించుకోవడం లేదు. గిరిజన మత్స్యకారులు సైతం రూ.30 నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు చేసి నాటు పడవలను స్వయంగా తయారు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారలు స్పందించి మత్స్యగెడ్డ ప్రాంతాల గిరిజనులకు రాయితీపై బోట్లు, వలలు అందించి, కుమ్మరిపుట్టు వద్ద వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



మత్స్యగెడ్డ ప్రాంతాల గిరిజన మత్స్యకారులకు ప్రభుత్వం రాయితీపై బోట్లు, వలలు అందించాలి. ఐటీడీఏ పివో అభిషేక్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించారు. బోట్లు, వలలు రాయితీపై అందిస్తామని హామీ ఇచ్చారు. కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై సైతం వంతెన నిర్మించాలి.

– వి.రమేష్, సర్పంచ్, సుజనకోట పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ప్రతిపాదనలు పంపాం



మండలంలో ఆరు పంచాయతీల్లో మత్స్యగెడ్డ ప్రాంతాల గిరిజనులకు బోట్లు, వలలు రాయితీపై అందించాలని గిరిజనులు మా దృష్టికి తీసువచ్చారు. దీంతో పాటు కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగింది. నిధులు మంజూరు చేస్తే వంతెన పనులు మొదలు పెట్టడం జరుగుతుంది. ముఖ్యంగా మత్స్యగెడ్డ ప్రాంతాల గిరిజనులు నాటు పడవలపై ప్రయాణాలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

– కె.కిరణ్‌కుమార్, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

వరద బాధితుల ఆందోళన



ఆందోళచేస్తున్న వరద బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగబాబు

కూనవరం: తమకు వరద నష్ట పరిహారం అందలేదని కోరుతూ స్థానిక సచివాలయం వద్ద వరద బాధితులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. మా ఇళ్లు నీట మునిగినా రూ.10 వేలు వరద సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ నాగబాబు స్పందించారు. ఆయన మాట్లాడుతూ వరద సాయం అందరికి అందుతుందన్నారు. ఎవరికైతే నష్ట పరిహారం అందలేదో వారి ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డు తదితర వివరాలు అందజేయాలని సూచించారు.

పిల్లల చదువుపై శ్రద్ధ అవసరం

గంగవరం: మండలంలోని టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రుల సహకారం కీలకమని, ప్రతి నెలా జరిగే తల్లిదండ్రుల సమావేశంలో అందరూ పాల్గొవాలని కోరారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు దొర, వైస్ చైర్మన్ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి దేవీనవరాత్రులు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో గిరి దుర్గా భవాని ఆలయంలో గురువారం నుంచి శ్రీదేవి నవరాత్రులు విశేష పూజలు నిర్వహించనున్నట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో అవతారంలో అమ్మవారిని అలంకరించి అర్చనలు చేస్తామన్నారు.మొదటి రోజు భువనేశ్వరి విశేష అలంకారంతో నైవేద్యాలు సమర్పిస్తామన్నారు. అమర వల్లభేశ్వరస్వామి వారికి అర్చన, అభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని ఆయన కోరారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు



వసతి గృహం నుంచి స్వగ్రామాలకు వెళ్తున్న విద్యార్థినులు

అరకులోయటౌన్: దసరా సెలవులను ప్రకటించడంతో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. మంగళవారం ఉదయం నుంచి విద్యార్థులు వసతి గృహాల నుంచి స్వగ్రామాలకు బయలుదేరారు. ఇళ్లకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు తల్లిదండ్రులు మంగళవారం ఉదయం నుండే వసతి గృహాలకు చేరుకున్నారు. వసతి గృహా నిర్వహాకులు అనుమతులు తీసుకోని వారి పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తున్నారు. దసరా సెలవుల కారణంగా స్వగ్రామాలకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో ఆటోలు, బస్సుల్లో రద్దీ ఏర్పడింది.

సబ్ డిపో మంజూరు

కొయ్యూరు: మండలంలోని మంప పంచాయతీ కేంద్రంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో డీఆర్ సబ్ డిపోను ఏర్పాటుచేశారు. గ్రామంలో డిపో కోసం సీపీఐ నాయకుడు సత్యనారాయణ తదితరులు సోమవారం సాయంత్రం సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అధికారులు గ్రామంలో పర్యటించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్ డిపోను మంజూరు చేశారు. ప్రస్తుతం ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేపట్టారు.

ఆస్పత్రికి వితరణ



జర్రెల పీహెచ్‌సీకి బెడ్‌లను అందజేస్తున్న దాతలు

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల కోసం గతంలో ఇచ్చిన బెడ్‌లు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు పడుకునేందుకే ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ తమ వ్యక్తిగత నిధులు రూ.20వేలు వెచ్చించి ఆస్పత్రిలో రోగులకు అవసరమైన ఆరు బెడ్లను సమకూర్చారు వీటిని మంగళవారం ఆస్పత్రిలో రోగులకు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లోవకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు విష్ణుమూర్తి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు వెంకటరమణ పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం

- గంటపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం



నేలకొరిగిన భారీ వృక్షం

డుంబ్రిగుడ: మండలంలోని ఆంధ్ర–ఒడిశా అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రధాన రహదారి గోరాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం భారీ వృక్షం కూలింది. ఈ సరిహద్దు ప్రాంతం అరకు– చట్టువాకు ప్రధాన రోడ్డు కావంతో ఇక్కడ నిత్యం వాహనాల రాకపోకలు రద్దీ ఉంటుంది. రోడ్డుపై వృక్షం నేలకొరగడంతో సుమారు గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులతో పాటు వాహనదారులు చెట్టు కొమ్మలను తొలగించడంతో వాహన రాకపోకలు యధావిధిగా జరిగాయి. చెట్టు కూలే సమయంలో వాహనాలు, పాదాచరులు ఆ రోడ్డుపైకి రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

జాతిపితకు ఘన నివాళి



అరకులో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్, అధ్యాపకులు



సీలేరులో విద్యార్థుల వేషధారణ

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతిపిత అందరికి ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మహిళ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో చెత్త చెదారం తొలగించారు. అంతర్జాతీయ కాఫీ డే, శాఖహార దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పట్నాసి చలపతిరావు, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మీ, పి.నాగబాబు, మొష్యా అనిత కుమారి, పంచాయతీ ఈఓ రాజ్ కుమార్, కార్యదర్శి ప్రసాద్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక డీఏవీ పాఠశాలలో గాంధీ జయంతిను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అహింసా ఆయుధంగా స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహానేతగా జాతిపిత గాంధీజీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. దసరా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వ్యర్థాలను సేకరిస్తున్న అధికారులు తదితరులు

వై.రామవరం: మండల కేంద్రంలో ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షత మంగళవారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. ఏపీఓ సాయిబాబ, ఎంఈవో కె.తాతబ్బాయిదొర పాల్గొన్నారు.

చింతపల్లి: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా భావించాలని చింతపల్లి ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతపల్లిలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ఆయా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు రాజ్ కుమార్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంపీడీవో ఆశాజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద డీఈఈ రాజు తదితరులు స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు. సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాడేరు : పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ద్వారా మంగళవారం స్థానిక మోదకొండమ్మ ఆలయంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పరిసరాలు, ఓపెన్ ఆడిటోరియం, అన్న ప్రసాదం తయారు చేసే వంటశాలలను శుభ్ర పరిచారు, ఆలయం గార్డెన్‌లో మొక్కలను నాటారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్, అధ్యాపకులు కోటేశ్వరరావు, రమేష్ బాబు, గణేష్, దామోదర్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, సిబ్బంది శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. పరిసరాలు శుభ్రం చేశారు. అన్ని గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు నిర్వహించి, అవగాహన కల్పిస్తున్నామని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.



వై.రామవరంలోని ప్రభుత్వ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది



మోదకొండమ్మ ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



ముంచంగిపుట్టులోని స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో కిరణ్‌కుమార్, సిబ్బంది

విద్యార్థులకు అభినందనలు



చెకుముకి పోటీల్లో విజేతలు



పోటీల్లో గెలిచిన విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్‌వో నాగేశ్వరరావు తదితరులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. పోటీల్లో 11 పాఠశాలలకు చెందిన 33 మంది విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. ఇందులో ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, లేనోరా ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో ఆయా విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ నెల 27న జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఆయా విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు.

పెదబయలు: మండల స్థాయి చెకుముకి పోటీల్లో పెదబయలు సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్టు జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు తెలిపారు. గత నెల 28న జరిగిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన హెమియారం, మాధురి, అనిత ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ నిర్మలహాస్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. ఉపాధ్యాయులు బాలరాజు, కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థి సందీప్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.సందీప్ మండల స్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభకనబర్చినట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈవో–1 సత్యనారాయణదొర తదితరులు విద్యార్థిని అభినందించారు. పీడీ పాల్‌బాబు, పీఈటీ నాగరాజు, రేష్మ, బొజ్జయ్య పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం



బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ ఆనంద్‌రావు తదితరులు

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయితీ కేంద్రంలో బోరు పనులను సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. దాస్, నాయుడు, బలరామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన



పీఆర్‌టీయు కార్యదర్శి శెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం

డుంబ్రిగుడ: మండలంలోని పలు గ్రామాల్లో పీఆర్‌టీయూ మండల శాఖా అధ్యక్షుడు లక్ష్మయ్య సోమవారం పలు పాఠశాలలు సందర్శించి, ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించారు. జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. సూరిబాబు, లలిత, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

30 శాతం నిధులు పంచాయతీకి కేటాయించాలి



మాట్లాడుతున్న సర్పంచ్, వైస్ సర్పంచ్ వెంకటరావు, జగ్గునాయుడు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో ప్రవేశ టికెట్‌ల ద్వారా వచ్చే నిధులను పంచాయతీకి 30 శాతం కేటాయించాలని కోరుతూ పోతంగి పంచాయితీ సర్పంచ్ వెంకటరావు, వైస్ సర్పంచ్ జగ్గునాయుడులు డిమాండ్ చేశారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2009 నుంచి చాపరాయి జలపాతంలో టెండర్ నిర్వహించి అందులో వచ్చే నిధులను పాడేరు ఐటీడీఏ అకౌంట్‌లో జమచేశారని, ప్రైవేట్ వ్యక్తులు చాపరాయిలో టికెట్ కౌంటర్‌తో పాటు పార్కింగ్ నిర్వహించేవారన్నారు. 2009 నుంచి రూ.1.10లక్షలతో మొదలైన టెండర్ 2022 వరకు రూ.30.03లక్షలకు చేరిందన్నారు. దీంతో కొంత నిధులు పంచాయతీకి వచ్చేవని, అయితే 2023 నుంచి చాపరాయిని ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.70లక్షలతో అభివృద్ధి చేసి స్వాధీనం చేసుకుందన్నారు.. అప్పటి నుంచి కొంతమంది నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి కల్పిస్తున్నారు. అయితే అందులో టికెట్‌ల ద్వారా వచ్చే నిధుల్లో ప్రతి నెల 30 శాతం నిధులు పోతంగి పంచాయతీ అభివృద్ధికి కేటాయించాలని సర్పంచ్, వైస్ సర్పంచ్ కోరారు.


ఎంపీడీవోకు ఘన సన్మానం



జి.మాడుగులలో ఎంపీడీవో జయసాగర్‌కు శాలువ కప్పి, బొకేను అందించి సన్మానిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం అధికారిగా(ఎంపీడీవో) పనిచేసి బదిలీపై వెళుతున్న లోహిత్ జయసాగర్‌కు ఎంపీటీసీ, సర్పంచ్‌లు మంగళవారం శాలువ కప్పి, బొకేను అందించి ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఎంపీడీవోలకు బదిలీ జరిగింది.ఇక్కడ పనిచేసిన ఎంపీడీవోను కాకినాడ జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, సర్పంచ్ చినకుమారి, పలాసి కృష్ణమూర్తి, జెసిఎస్ కన్వీనర్ కళ్యాణ్, నాయకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు, నేతలు

జి.మాడుగుల: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్‌చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సత్యనారాయణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు వలింటీర్ వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ తీసుకువెళ్లి లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా ప్రాణాలను లెక్కచేయకుండా ప్రభుత్వ పథకాలు అందించడంలో విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఎన్నిక సమయంలో కూటమి పార్టీలు వలంటీర్లుకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోనికి వచ్చిన తరువాత హామీలను తుంగలో తొక్కి వలంటీర్ల భవిష్యత్తు అంధకారంలోనికి నెట్టారని వారు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లును తక్షణమే విధుల్లోకి తీసుకొని నాలుగు నెలలు గౌరవ వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. వలంటీర్లుకు వైఎస్సార్‌సీపీకు ఎప్పుడూ అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు. సింగర్బ సచివాలయ కన్వీనర్ సూర్యప్రకాష్‌నాయుడు, నాయకులు మోహన్, మత్స్యలింగం పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం



ఎస్‌ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రాత్రిపూట అనవసరంగా ప్రజలు బయటకు రావద్దని, గంజాయి రవాణా, దొంగతనాల నివారణ కోసం మండల ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రవీంద్ర కోరారు.ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో జరుగుతున్న దొంగతనాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి, సిబ్బందిని అప్రమత్తం చేశామని, రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ప్రజలంతా దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరూ తిరిగినా తమకు సమాచారం ఇవ్వాలని, ముఖ్యంగా అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదన్నారు. గంజాయి రవాణా నియంత్రణ కోసం సైతం తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఎవరూ బయట తిరగొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తే దొంగతనాలు నివారించవచ్చన్నారు. దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రిళ్లు ఇంటి బయట విద్యుత్ దీపాలు వెలిగించే ఉంచాలన్నారు.

వరద బాధితులకు సాయం



కూనవరంలో దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దాతలు

కూనవరం: గోదావరి వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రతీ ఒక్కరు ముందుకొచ్చి బాధితులను ఆదుకోవాలని నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, బ్రహ్మయ్య అన్నారు. కూనవరం గ్రామంలో వరద ముంపునకు గురైన పేద నాయీబ్రాహ్మణ కుటుంబాలకు తుమ్మిడి బ్రదర్స్, న్యూస్ సంస్థల సహకారంతో సుమారు రూ. 60 వేల విలువైన వస్త్రాలు, నిత్యావసర సరకులను మంగళవారం పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వరద బాధితులందరికీ సరకులు రూపేణా సుమారు రూ.4లక్షల మేర సాయం అందించినట్టు నిర్వాహకులు ఉమామహేశ్వరరావు, బాను ప్రసాద్ తెలిపారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు సోము తదితరులు పాల్గొన్నారు.